సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



పగిడిద్దరాజు వెళ్లాకనే..

గుండాల మండలం యాపలగడ్డ నుంచి పగిడిద్దరాజు వెళ్లాకనే మేడారంలో సమ్మక్క జాతరకు అంకురార్పణ జరుగుతుంది. 8లో



క్రీడాస్ఫూర్తి చాటాలి

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు అన్నారు. రుద్రంపూర్‌లో అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై చలి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కాగా, వారాంతపు సెలవులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

రామయ్యకు రూ.2.30 లక్షల విలువైన ఆభరణాలు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన పెండ్యాల వెంకటరమణ దంపతులు రూ.2.30 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను శనివారం సమర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోగా, ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. అలాగే, శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హన్మకొండకు చెందిన వాకా సత్యనారాయణ–జయలలిత దంపతులు రూ.1,01,116 చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి : ఎస్పీ



మాట్లాడుతున్న రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కోర్టు డ్యూటీ అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం చేసేలా పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు. పెండింగ్ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తుండాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, రమాకాంత్, రమేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

రెండు స్లీపర్ క్లాస్ బస్సులు మంజూరు

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్ : మణుగూరు డిపోకు రాష్ట్ర ప్రభుత్వం రెండు స్లీపర్ క్లాస్ బస్సులను మంజూరు చేసిందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. పినపాక నియోజకవర్గం నుంచి నిత్యం వందలాది మంది ప్రజలు సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా రెండు నూతన స్లీపర్ క్లాస్ బస్సులను మంజూరు చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

‘గేట్’ ప్రశాంతం

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన గేట్ రెండో దశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం పరీక్షకు 75 మందికి గాను 68 మంది, మధ్యాహ్నం పరీక్షకు 69 మందికి గాను 60 మంది హాజరయ్యారు. రెండు విడతల్లో 16 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

అదనపు సూపరింటెండెంట్‌గా లక్ష్మణ్‌రావు

కొత్తగూడెంరూరల్: జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావుకు సర్వజన ఆస్పత్రి అదనపు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు డీఎంఈ త్రివేణి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత సూపరిటెండెంట్ కుమారస్వామిని కలెక్టర్ ప్రియాంక ఆల వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

టెంపుల్ టూరిజానికి | బడ్జెట్‌లో పెద్దపీట

తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో టెంపుల్ టూరిజానికి పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటించింది. బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలు అమల్లోకి వస్తే జిల్లా అభివృద్ధి కొత్తపుంతలు తొక్కనుంది. ప్రభుత్వ నిర్ణయంతో దేవాదాయ, పర్యాటక, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేసే అవకాశం ఉంటుంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



భద్రాచలం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- విద్యాసంస్థలకు సొంత భవనాల నిర్మాణం
- పాఠశాలల స్థాయిలో డిజిటల్ తరగతి గదులు
- మరోసారి తెరపైకి ఫసల్ బీమా

మూడు శాఖల సమన్వయం..

ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న హోటళ్లు, రిసార్టులు, అటవీ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయబోతున్నట్టు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం భక్తులు దర్శించుకునే ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. రిసార్టులు, హోటళ్లు పర్యాటక శాఖ ఆధీనంలో నడుస్తున్నాయి. ఈ రెండు శాఖలతో తమకేమీ సంబంధం లేదన్నట్టుగా అటవీశాఖ తన పని తాను చేసుకుపోతోంది. కొత్తగా టెంపుల్ టూరిజం విధానం అమల్లోకి వస్తే ఈ మూడు శాఖలు పరస్పర సహకారంతో పని చేసే అవకాశం ఉంటుంది. తద్వారా పుణ్యక్షేత్రాలకు వచ్చిన భక్తులు అక్కడున్న ప్రకృతి రమణీయ ప్రాంతాలను సందర్శించే వీలు కలుగుతుంది. అలాగే పర్యాటకులు ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఏర్పడుతుంది. జిల్లాలో భద్రాచలం వంటి పుణ్యక్షేత్రంతో పాటు విస్తారంగా అడవులు ఉన్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే కొత్తగూడెంలో హోటల్ నిర్మిస్తున్నారు. ఈ మూడు శాఖలు సమన్వయంతో పని చేస్తే టెంపుల్ టూరిజంలో షిరిడీ, తిరుపతి సరసన భద్రాద్రి జిల్లా చేరే ఆస్కారం ఉంటుంది.

భద్రాచలం అభివృద్ధికి కార్యాచరణ..

తెలంగాణ వచ్చిన తర్వాత యాదాద్రి ఆలయాన్ని కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వేములవాడలో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. కానీ భద్రాచలం విషయానికొస్తే గత పదేళ్లలో హామీలు తప్ప క్షేత్రస్థాయిలో కార్యాచరణ కరువైంది. భద్రాచలం అభివృద్ధి కోసం గత సీఎం కేసీఆర్ ఇస్తానన్న రూ.100 కోట్ల విషయంలో ఎంతకీ కదలిక రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మిగిలిన పుణ్యక్షేత్రాలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఉన్న భద్రాచలం, జమలాపురం పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తామని ప్రకటించడం శుభపరిణామంగా చెప్పొచ్చు.

అద్దె భవనాలకు స్వస్తి..

జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు మొదలు మెడికల్ కాలేజీ వరకు అనేక విద్యాసంస్థలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. అద్దె భవనాల్లో ఉన్న బీసీ హాస్టళ్లకు కూడా సొంత భవనాలు మంజూరు కానున్నాయి. నిధుల సమస్య కారణంగా జిల్లాలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రస్తుతం నర్సింగ్ కాలేజీ భవనాల్లో మెడికల్ కాలేజీ తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు నర్సింగ్ కాలేజీ సైతం అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది. ఈ సమస్యలకు త్వరలో పరిష్కారం లభించనుంది.

డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు..

ప్రభుత్వ విద్యా సంస్థలను నేటి కాలమాన పరిస్థితులకు తగ్గట్టుగా మార్చే ఉద్దేశంతో ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. తద్వారా జిల్లాలో ఉన్న 791 ప్రాథమిక పాఠశాలలు, 164 ప్రాథమికోన్నత, 109 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు అందుబాటులోకి రానున్నాయి. మొక్కుబడిగా మారిన ఐటీఐ వంటి వృత్తి విద్యా కోర్సులకు సైతం నూతన జవసత్వాలు సమకూరనున్నాయి.

ఫసల్ బీమాతో భరోసా..

రైతుబంధు వంటి పథకాలు రైతులకు భరోసా ఇస్తున్నప్పటికీ.. చీడపీడలు, వరదలు, అకాల వర్షాలతో నష్టపోయే రైతులకు ప్రభుత్వం నుంచి అండదండలు లభించడం లేదు. కొత్తగా బెంగాల్ తరహాలో ఫసల్ బీమా అమలు చేస్తామని బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ప్రతీ ఏడాది గోదావరి వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా పది వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. ఫసల్ బీమా అందుబాటులోకి వస్తే రైతులకు సాగుపై మరింత భరోసా పెరుగుతుంది.

- మున్సిపాలిటీల అభివృద్ధికీ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కానున్నాయి.
- సాగునీటి రంగానికి కొంతమేర నిధులు ప్రకటించినా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా వరప్రదాయనిగా చెబుతున్న సీతారామ ప్రాజెక్టు పనులు, నిధుల మంజూరు విషయంలో ప్రత్యేకించి ప్రస్తావించలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో గ్రీన్ ట్రిబ్యునల్ వరకు అనేక వివాదాలు ఇప్పటికే చుట్టుముట్టి ఉన్నాయి.

బడ్జెట్ జనరంజకం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. రూ.2,73,891 కోట్లలో ఆరు గ్యారంటీల అమలు కోసం అత్యధికంగా రూ.53,196 కోట్లు కేటాయించడం హర్షణీయం. ఎన్నికల వాగ్దానాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకుంది. గతంలో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టని విధంగా ఈ బడ్జెట్ ఉంది.

– కొత్వాల శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్

విద్యారంగాన్ని గాలికొదిలేసింది



రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా.. బడ్జెట్‌లో ఆ రంగానికి కేటాయింపులు ఆశాజనకంగా లేవు. సంక్షేమ హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలల భవన నిర్మాణాలకు కేటాయించిన మొత్తం ఏ మాత్రం సరిపోదు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాల్సినవి రూ.7,800 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. సంక్షేమ వసతిగృహాలకు మెస్, కాస్మొటిక్స్ చార్జీల పెంపు ప్రస్తావనే లేదు.

–వీరభద్రం, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

కేటాయింపులతో సరిపోదు



ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. ప్రజాహిత అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయం. అయితే విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం వంటి ప్రధాన అంశాలకు ఇంకా ఎక్కువగా ప్రాధాన్యం కల్పించాల్సి ఉంది. కేటాయించిన నిధుల విడుదలలో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– సాబీర్‌పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి

15న ‘ఓడీఓఈ’ ఎగ్జిబిషన్

పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్‌ఏబీఏఆర్‌డీ) సహకారంతో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ) ఒన్ డ్రిస్ట్రిక్ట్ – ఒన్ ఎగ్జిబిషన్ (ఓడీఓఈ) అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈనెల 15, 16, 17 తేదీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కొత్తగూడెంలో కలెక్టరేట్, మహబూబ్‌నగర్‌లో శిల్పారామం, నిజామాబాద్‌లో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఈ ఎగ్జిబిషన్ కోసం ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. వ్యవసాయం, నీటిపారుదల, వ్యర్థాల నిర్వహణ, పాడిపరిశ్రమ, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గ్రామీణ ఆవిష్కర్తలు అందుబాటులో ఉన్న వస్తువులను వినియోగించి రూపొందించిన, స్థానిక పరిష్కారాలను ప్రోత్సహించేలా వేదికను రూపొందించామని చెప్పారు. నాబార్డు సహకారంతో మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమం 15న కొత్తగూడెం, 16న మహబూబ్‌నగర్, 17న నిజామాబాద్‌లో జరుగనుందని వివరించారు. ఎగ్జిబిషన్లకు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, స్వయం సహాయక బృందాలు, స్థానికులు, కళాశాల విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో వినూత్న పరిష్కారాల విస్తరణ, రైతులు, స్థానిక కార్మికులకు శారీరక శ్రమను తగ్గించడం, తక్కువ ధర, స్థిరమైన పరిష్కారాలు, మార్కెట్ యాక్సెస్, వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. నాబార్డు అనేది దేశ అత్యున్నత అభివృద్ధి బ్యాంకని, ఆర్థిక, ఆర్థికేతర జోక్యాలు, ఆవిష్కరణలు, సంస్థాగత అభివృద్ధి ద్వారా గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించేలా కృషి చేస్తోందని తెలిపారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

కొత్తగూడెం ఆర్డీఓగా మధు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రెవెన్యూ అధికారులను బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగూడెం ఆర్డీఓ, పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు ఎనిమిది మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. 9 మంది తహసీల్దార్లు బదిలీపై జిల్లాకు వస్తున్నారు. కొత్తగూడెం ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న శిరీషను ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె స్థానంలో మెట్‌పల్లి ఆర్డీఓగా పనిచేస్తున్న డి. మధును నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.శంకర్‌కుమార్‌కు పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ)గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక తహసీల్దార్లు ఎల్. వీరభద్రం(అశ్వాపల్లి), సదియా సుల్తానా(చండ్రుగొండ), ఆర్. అనంతరామకృష్ణ(చర్ల), ఆర్.శారద (జూలూరుపాడు), కె. చంద్రశేఖర్(కరకగూడెం), సీహెచ్ నాగరాజు(పాల్వంచ), డి.వీరభద్రప్రసాద్(పినపాక), కె. కృష్ణవేణి(టేకులపల్లి)ని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. బూర్గంపాడు తహసీల్దార్ తిరుమలాచారిని డీఏఓ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఖమ్మం జిల్లా నుంచి కె. శ్రీనివాసరావు(కల్లూరు ఆర్డీఓ కార్యాలయం), మహబూబాబాద్ జిల్లా నుంచి జి.వివేక్, మేకల ఇమానుయేల్, ఎస్.నాగభవానీ, కె. స్వాతి నాయుడు, మామిడి అశోక్‌కుమార్, తోట సూర్యనారాయణ, సీహెచ్ నరేష్, వరంగల్ జిల్లా నుంచి జి.జగదీశ్వర్(కలెక్టరేట్ సూపరింటెండెంట్)లు భద్రాద్రి జిల్లాకు బదిలీపై వస్తున్నారు.

సింగరేణి పీఆర్వోకు డాక్టరేట్



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న జీఎం సురేష్



డాక్టరేట్ అందుకుంటున్న సుశీల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పీఆర్వో శ్రీరాముల శ్రీకాంత్‌కు డాక్టరేట్ లభించింది. ‘రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూమెంట్స్ – ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూమెంట్’ అన్న అంశంపై ఆయన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం పర్యవేక్షణలో పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. ఈ మేరకు శ్రీకాంత్‌కు నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనను జీఎం(కోఆర్డినేషన్), చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి ఎం.సురేష్ అభినందించారు.

ఎర్రగుంట ఏఎన్‌ఎంకు..

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న తేజావత్ సుశీలకు సికింద్రాబాద్‌లోని డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. గతంలో కూడా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న సుశీలకు ఇప్పుడు డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందించారు.

ప్రశ్నించేతత్వం పెరగాలి

- ప్ర.ర.వే. మహాసభలో స్త్రీవాద రచయిత ఓల్గా



మాట్లాడుతున్న స్త్రీ వాద రచయిత్రి ఓల్గా

ఖమ్మంగాంధీచౌక్: మహిళలకు జరుగుతున్న అవమానాలపై ప్రశ్నించే తత్వం పెరగాల్సిన అవసరముందని స్త్రీవాద రచయిత ఓల్గా అన్నారు. సమాజంలో పెచ్చుమీరుతున్న అభ్యంతరకర శక్తులను ధైర్యంగా ఎదిరించాలని సూచించారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్రరవే) ఏడో మహాసభలు ఖమ్మంలో శనివారం ప్రారంభమయ్యాయి. స్త్రీలపై ట్రోలింగ్ ప్రధానాంశంగా నిర్వహిస్తున్న ఈ సభల్లో జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ వేణు, కేఎన్.మల్లీశ్వరి మాట్లాడారు. అనంతరం ‘ట్రోల్’ పుస్తకాన్ని ఆవిష్కరించాక ఓల్గా మాట్లాడుతూ.. అనాదిగా మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని, దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయి ఫూలేపై ప్రత్యక్ష దాడులు జరిగాయని తెలిపారు. అయినా ఆమె ధైర్యంగా ముందుకు సాగారన్నారు. ఎందరో రచయిత్రులు సమాజంలో జరుగుతున్న ఘటనలపై పుస్తకాలు రాయగా.. రచయిత్రులపైనా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. కొందరు అవమానాలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. అయితే, వేధింపులు, అవమానాలకు భయపడకుండా ఎదిరించాలని ఆమె సూచించారు. ఆ తర్వాత తిరునగరి దేవకీదేవి అధ్యక్షతన జరిగిన ‘ట్రోల్’ పుస్తక పరిచయ కార్యక్రమంలో రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ పూర్వం నుంచి ట్రోలింగ్ సమస్య ఉండగా.. సాంకేతికతతోనే పాటు మరింత పెరిగిందని చెప్పారు. ఆతర్వాత జీఎస్. రామ్మోహన్, జహా ఆరా, కాత్యాయనీ విద్మహే, కొండేపూడి నిర్మల, కృష్ణకుమారి వివిధ అంశాలపై మాట్లాడగా రవిమారుత్, భూమిక సత్యవతి, దీప్తి, మలుపు బాల్‌రెడ్డి, అమర జ్యోతి, ఉరిమళ్ల సునంద, ఖలీదా పర్వీన్, షెహనాజ్ బేగం, ప్రసేన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ఇల్లెందు: పట్టణంలోని కీలకమైన సెంట్రల్ లైటింగ్, డివైడర్, రోడ్ల పనులకు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. అవిశ్వాసం నుంచి బయటపడిన మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఇక అభివృద్ధి పనుల వేగవంతంపై సమాలోచనలు చేశారు. పట్టణంలో 8 పనులకు రూ.6.75 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో సెంట్రల్ లైటింగ్, డివైడర్, రోడ్డు వెడల్పు పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. పట్టణంలోని గోవింద్ సెంటర్ నుంచి చెరువు కట్ట (పాకాల రోడ్) వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు రూ. 2 కోట్లతో చేపట్టనున్నారు. రూ.కోటితో గోవింద్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం వరకు, రూ.50 లక్షలతో జేకే బస్టాప్ నుంచి కొత్త కాలనీ వరకు, రూ.30 లక్షలతో కరెంటాఫీస్ నుంచి డిగ్రీ కాలేజీ వరకు, రూ.20 లక్షలతో లలిత కళామందిర్ రోడ్‌లో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నారు. రూ.1.50 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ ప్లాట్‌ఫామ్ పనులు, ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్ వెడల్పునకు రూ.కోటి, ప్రభుత్వ ఆస్పత్రిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.25 లక్షలు వెచ్చించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరు కావాలంటూ అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లతో పాటు అన్ని పార్టీల నాయకులు, అధికారులకు ఆహ్వానాలు పంపించారు.

ముగిసిన డీఏఈ పోటీలు



అజంతా జట్టుకు బహుమతి అందజేస్తున్న సీమా శర్మజైన్, సత్యకుమార్, జగ్గారావు తదితరులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో ఐదు రోజులుగా జరుగుతున్న అఖిల భారత అణుశక్తి విభాగం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ పోటీలు శనివారం ముగిశాయి. దేశవ్యాప్తంగా వివిధ యూనిట్ల నుంచి సుమారు 200 మంది కళాకారులు ఈ పోటీలకు హాజరై తమ కళలతో అలరించారు. ముగింపు వేడుకల్లో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, అణుశక్తి, స్పేస్, ఎర్త్ కమిషన్ సభ్యురాలు సీమా శర్మ జైన్, భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత అణుశక్తి విభాగంలో మణుగూరు భారజల కర్మాగారానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశంలో మొట్టమొదట మణుగూరు భారజల కర్మాగారంలో ఆక్సిజన్–18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ ఉత్పత్తి జరుగుతోందని, ఇది కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ(పీఈటీ) స్కానింగ్ ద్వారా దీన్ని కేన్సర్ బాధితుల శరీరాల్లో ప్రవేశపెడితే కేన్సర్ కణాలను నిర్ధారించి చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచంలో ఈ వాటర్‌కు ఎంతో డిమాండ్ ఉందని, ఇప్పటివరకు ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకుందని తెలిపారు. భవిష్యత్‌లో ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో మణుగూరు భారజల కేంద్రంలో ఆక్సిజన్–18 వాటర్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. దీని విలువ లీటర్‌కు రూ.18 నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, డీజీఎంలు హెచ్‌కే.శర్మ, శ్రీనివాసరావు, విశ్వనాథ్, సీఏఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు, రన్నరప్‌ల వివరాలిలా..

వోకల్ లైట్ మ్యూజిక్ సోలో సాంగ్ విభాగంలో ప్రథమ బహుమతి అమూల్య రైనా(అజంతా), ద్వితీయ బహుమతి మిర్యాల హుస్సేన్(నాగార్జున–మణుగూరు), గ్రూప్ సాంగ్‌లో ప్రథమ బహుమతి అజంతా, ద్వితీయ బహుమతి ఎల్లోరా జట్టు, క్లాసికల్ మ్యూజిక్ హిందుస్థానీలో ప్రథమ బహుమతి పవన్ కలాంబే(ఎల్లోరా), ద్వితీయ బహుమతి ప్రణయ్ డీ బెలేకర్(ద్వారకా), మ్యూజిక్ కర్ణాటిక్‌లో ప్రథమ బహుమతి కె.ఎస్.విగ్నేష్(రామేశ్వరం), ద్వితీయ ఎస్.సత్యనారాయణ(నాగార్జున–మణుగూరు), గ్రూప్ డ్యాన్స్‌లో ప్రథమ ఎల్లోరా, ద్వితీయ ద్వారకా జట్టు, ఇన్‌స్ట్రుమెంటల్–హిందుస్థానీ, కర్ణాటిక్, వెస్ట్రన్‌లో ప్రథమ బహుమతి ప్రశాంత్ వి.కదాం(ఎల్లోరా), ఎస్.శంకర్(రామేశ్వరం), పెర్కుషన్–హిందుస్థానీ, కర్ణాటిక్, వెస్ట్రన్‌లో ప్రథమ బహుమతి సునీల్ డి కొర్గాంకర్(ఎల్లోరా), ద్వితీయ బహుమతి శేఖర్ వి పాటిల్(ద్వారకా), ఫెయిర్ ప్లే టీం బహుమతి నరేంద్ర కుమార్ శర్మ(పుష్కర్), టీం మేనేజర్ విభాగంలో ప్రథమ బహుమతి ఎస్.ఎస్ కుమవత్(ఎల్లోరా), ద్వితీయ బహుమతి మనస్వి ఎం పాటిల్(అజంతా), ఫ్రెండ్ ఆఫ్ ది టీంగా శేఖర్ వి పాటిల్(ద్వారకా) ఉన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికితీయాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



కరదీపక పుస్తకాలతో డీఈఓ, అధికారులు, విద్యార్థులు

పాల్వంచరూరల్ : విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ‘విద్యార్థుల కోసం’ కార్యక్రమంలో ఆయన కరదీపిక పుస్తకం, బ్యాడ్జీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రతీ వారం ఎంపిక చేసిన పాఠశాల విద్యార్థులకు ఇక్కడ బోధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.పూర్ణచందర్‌రావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వనజ, అధ్యాపకులు ఎస్‌కే.సైదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15 నుంచి క్రీడా సంబురాలు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 15,16,17వ తేదీల్లో ఖేలో భద్రాద్రి సంబురాలను నిర్వహించనున్నట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు హాజరవుతారని పేర్కొన్నారు.

ఐటీడీఏ స్క్రాప్ వేలం పూర్తి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో పేరుకుపోయిన పాత కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర సామగ్రి(స్క్రాప్) అమ్మకానికి శనివారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది టెండర్లు దాఖలు చేయగా, అధిక మొత్తంలో కోట్ చేసిన ఖమ్మంకు చెందిన పాషాకు అప్పగించినట్లు ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు భీమ్, వెంకటేశ్వరరాజు, రమణయ్య, నరసింహారావు, శ్రీనివాస్, ఎఫ్తార్ శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, రాందాస్, కరీం, రాంకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల ఉపాధ్యాయుడికి మెమో

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడికి డీఈఓ వెంకటేశ్వరాచారి శనివారం మెమో జారీ చేశారు. సదరు ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ సున్నం సమ్మయ్య విచారణ చేపట్టి జిల్లా అధికారులకు నివేదిక అందచేశారు. దీంతో మెమో జారీ చేసి మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు.

పశువులు పట్టివేత

కరకగూడెం: మండలంలోని వెంకటాపురం గ్రామం నుంచి మూడు పశువులను అక్రమంగా హైదరాబాద్ తరలిస్తుండగా లక్ష్మీపురం శివారులో శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పశువులను అన్నపూర్ణ గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్, పశువులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

పగిడిద్దరాజు వెళ్లాకనే..

మేడారం జాతరకు అంకురార్పణ..

- సమ్మక్క భర్త పగిడిద్దరాజుది యాపలగడ్డ గ్రామం
- 19న పడగలతో బయల్దేరనున్న అరెం వంశీయులు
- సుమారు 70 కిలోమీటర్లు కాలినడకన వెళ్లనున్న పూజారులు



పడగలతో మేడారం తరలివెళ్తున్న అరెం వంశీయులు (ఫైల్)

గుండాల: గుండాల మండలం యాపలగడ్డ నుంచి పగిడిద్దరాజు బయల్దేరి వెళ్లాకనే దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు అంకురార్పణ జరుగుతుంది. సమ్మక్క భర్త, సారలమ్మ తండ్రి అయిన పగిడిద్దరాజు స్వగ్రామం యాపలగడ్డ. ఇక్కడి నుంచి పగిడిద్దరాజు ములుగు జిల్లాలోని మేడారానికి చేరుకుంటేనే జాతరకు బీజం పడుతుంది. రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు అరెం వంశానికి చెందిన పగిడిద్దరాజును యాపలగడ్డ గ్రామానికి చెందిన ఆ వంశీయులు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 21వ తేదీ నుంచి జాతర ప్రారంభం కానుండగా, పగిడిద్దరాజును ఈ నెల 19న యాపలగడ్డ నుంచి మేడారానికి కాలినడకన తీసుకెళ్లనున్నారు.

అరెం వంశీయుడిగా ప్రసిద్ధి

పగిడిద్దరాజు యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడని, మూడు తరాలుగా కొలుస్తున్నామని ఆ వంశీయులు చెబుతున్నారు. నాటి ఆభరణాలు, ఈటెలు, బల్లెం తదితర వస్తువులు ఇప్పటికీ గుడిలో భద్రపరిచారు. వేపలగడ్డ సమీపంలోని తొట్టివాగు వద్ద పగిడిద్దరాజు, సమ్మక్కల గద్దెలు నిర్మించి ప్రతీ సంవత్సరం జాతర నిర్వహిస్తున్నారు. రెండేళ్లకొకసారి ఇక్కడి నుంచే మేడారం జాతరకు పడగ(జెండా)లను కాలినడకన తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. పగిడిద్దరాజును తీసుకెళ్లడంతోనే జాతర ప్రారంభమవుతుంది.

జాతర ముందురోజు జంపన్న వాగులో బస

యాపలగడ్డలో ఉన్న పగిడిద్దరాజు గర్భగుడి నుంచి పడగ(జెండా)లకు, శివసత్తులకు పురాతన కాలం నాటి ఆభరణాలకు పూజారులు(వడ్డెలు) ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వీరితో పాటు వరంగల్ జిల్లా పూనుగొండ్ల గ్రామానికి చెందిన అరెం వంశీయులు ఉంటారు. పగిడిద్దరాజు గద్దెల వద్దకు తీసుకెళ్లి అక్కడ పూజలు చేస్తారు. ఈ నెల 19న బయలుదేరి మహాజాతర ప్రారంభమయ్యే 21వ తేదీకి జాతర ప్రాంగణానికి చేరుకుంటారు. జాతర ముందురోజు జంపన్న వాగులో బస చేస్తారు. పగిడిద్దరాజుతో పాటు, కొండాయిగూడెం నుంచి గోవిందరాజును, కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవతలను ఆయా గ్రామాల పూజారులు 21వ తేదీ నాటికి ఆయా గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. 22న సమ్మక్క దేవతను గద్దెల వద్దకు తీసుకురావడంతో నిండు జాతర ప్రారంభమవుతుంది. జాతర అనంతరం పడగలను తిరిగి వేపలగడ్డకు చేర్చుతారు.

మార్చి 6 నుంచి పగిడిద్దరాజు జాతర

మేడారం జాతర ముగిశాక మూడు వారాల తర్వాత యాపలగడ్డలో పగిడిద్దరాజు జాతర నిర్వహిస్తారు. మార్చి 6,7,8 తేదీలలో జాతర నిర్వహించనున్నట్లు అరెం వంశీయులు తెలిపారు.

30 ఏళ్లుగా తీసుకెళ్తున్నా..



మా ఇలవేల్పు, వన దేవత అయిన మేడారం సమ్మక్క భర్త పగిడిద్దరాజు అరెం వంశీయుడు. మా పూర్వీకుల ద్వారా ఈ విషయాలు తెలిశాయి. 30 ఏళ్లుగా నేను మేడారానికి కాలినడకన పగిడిద్దరాజును తీసుకెళ్తున్నా. మాతో పాటు పూనుగొండ్ల గ్రామస్తులు వస్తారు.

– అరెం అప్పయ్య, పూజారి

వైభవంగా నిర్వహిస్తాం



మేడారంలో నిండు జాతర అనంతరం వేపలగడ్డలో అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా పగిడిద్దరాజు జాతర నిర్వహిస్తాం. దేవతలకు మొక్కులు చెల్లించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఇక్కడి జాతర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నాం.

–అరెం కాంతారావు

కొడవటంచ సమీపంలో నడయాడిన వనదేవతలు

కిన్నెరసాని నది ఒడ్డున సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు నడయాడినట్లు ప్రతీతి. సమ్మక్కను వివాహం చేసుకున్న తర్వాత పగిడిద్దరాజు తన కుమారుడు జంపన్న, కుమార్తె సారలమ్మతో కలిసి కొడవటంచ సమీపంలోని బర్లగుట్టపై నివసించినట్లు తెలుస్తోంది. జామరగూడెం సమీపంలోని కిన్నెరసాని–మల్లన్న వాగు కలిసే ప్రదేశంలో వారు స్నానాలు చేసేవారని ప్రచారం. దీంతో ఆ వాగుకు ఆదిమడుగుగా పేరు వచ్చింది. అదే ప్రాంతంలో బొర్రికుంటను కూడా వారే తవ్వి ఉంటారని భావిస్తూ, భక్తులు అక్కడ పసుపు కుంకుమలతో నిత్యం పూజలు చేస్తుంటారు.



పగిడిద్దరాజు – సమ్మక్క ఆభరణాలు, ఆయుధాలు

ఆదివాసీలకే మహబూబాబాద్ టికెట్ కేటాయించాలి

ఇల్లెందు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ టికెట్ ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(ఏజేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఇల్లెందు శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ మాట్లాడారు. రాష్ట్రంలోని మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీ సీట్లు ఆదివాసీలకు కేటాయించాలని కోరుతూ ఈనెల 15న చలో గాంధీ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2009లో మహబూబాబాద్ స్థానం ఏర్పడినప్పటి నుంచి ఆదివాసీలకు కేటాయించాలని కోరుతున్నా పార్టీలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో 5.74 లక్షల మంది ఆదివాసీ ఓటర్లు ఉన్నందున.. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న ఆదివాసీ నేత ఎట్టి వెంకన్నకు కేటాయిస్తే తామంతా అండగా ఉండి గెలిపించుకుంటామని తెలిపారు. ఈమేరకు డిమాండ్‌తో నిర్వహించే చలో గాంధీభవన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, నాయకులు పడిగ నాగేశ్వరరావు, తాటి మధు, బొల్లి సారయ్య, తాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

క్రీడాస్ఫూర్తి చాటాలి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవంలో వక్తలు

సింగరేణి(కొత్తగూడెం): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి 9వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములను పాజిటివ్‌గా తీసుకున్నవారే భవిష్యత్‌లో రాణిస్తారని పేర్కొన్నారు. క్రీడాకారులు విద్యపై కూడా దృష్టి పెట్టినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. తొలుత దివంగత అథ్లెటిక్స్ కోచ్ ఆనంద్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాండ్ర నారాయణ రావు ట్రస్ట్ సభ్యులు స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు మహిధర్, రాధాకృష్ణ, బి.హనుమంత రావు, వైస్ ఎంపీపీ మల్లికార్జున్, ఐఎన్‌టీయూసీ నాయకులు జిదుల రాజేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, జి. వీరస్వామి, వీరభద్రం, ఆదినారాయణ, కాశీ హుస్సేన్, మొగిలి, తాండ్ర నాగబాబు, గుమలాపురం సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఆదిలాబాద్ నిలిచింది.



విజేతకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రాష్ట్ర అథ్లెటిక్ కార్యదర్శి సారంగపాణి తదితరులు

డంపింగ్‌యార్డులో మంటలు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామంలో డంపింగ్‌యార్డులో శనివారం రాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. డంపింగ్ యార్డు ఇళ్ల మధ్య ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. మంటల వల్ల చెత్తలో ఉన్న సీసాలు ఎగిరిపడుతున్నాయని, చెత్త తగులబెట్టేందుకు పంచాయతీ సిబ్బంది నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు. డంపింగ్‌యార్డును జనావాసాల మధ్య తరలించాలని కోరుతున్నారు.



నెల్లిపాక బంజరలో డంపింగ్ యార్డులో ఎగిసిపడుతున్న మంటలు

రూ.94 వేల నగదు స్వాహా

పాల్వంచ: ఇంటి వద్దే ఉండి పార్ట్ టైం జాబ్ ద్వారా డబ్బులు సంపాదించుకోవచ్చంటూ సెల్‌ఫోన్‌కు లింక్ పంపించి సైబర్ నేరగాళ్లు రూ.94వేలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఓ మహిళ సెల్‌ఫోన్‌కు పార్ట్ టైం జాబ్ ద్వారా డబ్బులు సంపాదించవచ్చంటూ ఓ లింక్ వచ్చింది. దీంతో నమ్మిన ఆమె ఓపెన్ చేసింది. అందులో చేరాలంటే మొదట రూ.50 కట్టాలని సూచించారు. అనంతరం రూ.2వేలు, ఆ తర్వాత రూ.6 వేలు, రూ.25వేలు, రూ.68 వేలు పంపాలని నమ్మబలకగా ఆమె పంపించింది. చివరగా మరో రూ.94 వేలు కడితే కట్టిన డబ్బులు వస్తాయని లేకుంటే రావని మళ్లీ పేర్కొనడంతో మోసపోయినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ర్యాంపులకు ట్రెంచ్

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం, దుమ్ముగూడెం గ్రామాల వద్ద ఇసుక కోసం గోదావరి నదికి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు శనివారం కందకాలు తవ్వించారు. కొన్ని రోజులుగా కొందరు అక్రమంగా ర్యాంపులు నిర్వహిస్తూ ఇసుక తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాలతో ఆర్‌ఐ ఆదినారాయణ జేసీబీతో కందకాలు తవ్వించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరిక జారీ చేశారు.

పిల్లల కిడ్నాప్ అంటూ పుకార్లు

సుజాతనగర్: మండలంలో కొన్ని చోట్ల చిన్న పిల్లలను కిడ్నాప్ చేశారంటూ పుకార్లు వ్యాపించడం శనివారం కలకలం రేపింది. సీతంపేట బంజర, రాఘవాపురం, సీతంపేట, సుజాతనగర్ తదితర ప్రదేశాల్లో చిన్నారులను కిడ్నాప్ చేశారంటూ వదంతులు వ్యాపించడంతో తల్లిదండ్రులతోపాటు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. కొందరు తల్లిదండ్రులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సైతం ఫోన్ చేసి వాకబు చేసినట్లు తెలిసింది. కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వారు వచ్చిన తర్వాతనే పిల్లలను ఇంటికి పంపించారు. దీనిపై ఎస్సై సోమేశ్వర్‌ను వివరణ కోరగా... పిల్లల కిడ్నాప్ అంటూ వచ్చిన వదంతుల్లో వాస్తవం లేదని తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పుకార్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

దమ్మపేట: మండలంలోని ఎర్రన్నపేట గ్రామ శివారులో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అదనపు ఎస్‌ఐ చీమా తెలిపారు.

ఇసుక లారీ సీజ్

బూర్గంపాడు: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు మండలం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని బూర్గంపాడులోకి ప్రవేశించగానే అడ్డుకున్నారు. ఇసుక రవాణాకు అనుమతి లేకపోవటంతో తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కరకగూడెంలో రెండు ట్రాక్టర్లు...

కరకగూడెం: కరకగూడెం పెద్దవాగు నుంచి శనివారం రెండు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనాలను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

ఐఎన్‌టీయూసీ నేత ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న జగన్నాథం

ఇల్లెందు: ఇల్లెందు ఐఎన్‌టీయూసీ లీనేత ఒలింగాల జగన్నాథం శనివారం తన ఇంట్లో షుగర్ మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో చికిత్స నిమిత్తం సింగరేణి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. కాగా గుర్తింపు కార్మిక సంఘం ఉపాధ్యక్ష పదవి రాలేదని కొద్ది రోజులుగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. వారం రోజుల క్రితం సోషల్ మీడియాలో మనోవేదన వెళ్లగక్కారు. ఎంతకీ అధిష్టానం పదవి ఇవ్వడంలేదనే మనోవేదనతో ఇంట్లోని టాబ్లెట్లు మింగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తోటి సెక్యూరిటీ గార్డులు, నాయకులు ఆస్పత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కొత్తగూడెంలో శనివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం రాంపురం గ్రామానికి చెందిన చల్లా దుర్గాప్రసాద్ (18) కొంతకాలంగా తన తల్లి ఉమాతో కలిసి ఖమ్మంలో నివాసం ఉంటున్నాడు. తల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తుండగా, ఐటీఐ పూర్తి చేసిన దుర్గాప్రసాద్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కాగా అతని తండ్రి గతంలోనే మృతి చెందాడు. రాంపురం గ్రామంలో శుక్రవారం స్నేహితురాలు చనిపోవడంతో అదే రోజురాత్రి కడసారి చూపునకు బయల్దేరాడు. రాత్రి వేళ వద్దంటూ తల్లి వారించగా శనివారం తెల్లవారుజామున తల్లి విధులకు వెళ్లాక.. ఖమ్మం నుంచి స్కూటీపై బయల్దేరాడు. కొత్తగూడెం మీదుగా రాంపురానికి వస్తున్న క్రమంలో ఉదయం 6 గంటల సమయంలో సింగరేణి ఉమెన్స్ కళాశాల వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో తల్లి బంధువులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మృతుడికి సోదరుడు ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులతోపాటు పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పాలకోయతండా గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశ్వర్లు(25) తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా బాగోలేకపోవడంతోపాటు పెళ్ళి కావడం లేదనే మనస్తాపంతో గత నెల 23న గడ్డి మందుతాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కొత్తగూడెం, అనంతరం వరంగల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అడిషనల్ ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన ఆర్టిజన్..

మతి స్థిమితం లేక పురుగుల మందు తాగిన కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పట్టణంలోని బొల్లేరుగూడేనికి చెందిన లకావత్ అప్పారావు(45)కు మతి స్థిమితం లేదు. ఈ క్రమంలో శుక్రవారం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి ఓ ప్రైవేట్ కళాశాల సమీపాన గుర్తుతెలియని వ్యక్తి(30) మృతదేహాన్ని శనివారం గుర్తించారు. సదరు వ్యక్తి మృతి చెంది మూడు, నాలుగు రోజులు దాటుతుండగా, కుళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించిన పోలీసులు, కేసు దర్యాప్తు చేపట్టారు.